

తాయిలమిస్తే తప్పదు శిక్ష ..

అసెంబ్లీకి నవంబర్ 30న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అనేక రకాల తాయిలాలు అందిస్తుంటారు. 10లో▸



బతుకమ్మ వేడుకలు

కుంటాల: మండలంలోని అందాకూర్, అంబకంటి గ్రామాల్లో శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పవార్ రామారావ్ పటేల్, ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, మాజీ ఎంపీపీ రమణారావు, ఎంపీటీసీ కట్ట రవి, పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.4 / 18.4

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి చలి ప్రభావం కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నామినేషన్ ప్రక్రియపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ ప్రక్రియపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. నవంబర్ 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీయాలని సూచించారు. అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎలాంటి బ్లాంక్‌లు లేకుండా చూసుకోవాలన్నారు. చెక్‌లిస్ట్ ప్రకారం నామినేషన్ ఫారం అభ్యర్థులు సమర్పించేలా చూడాలన్నారు. నామినేషన్ స్క్రూట్నీ రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. 13వ తేదీన నామినేషన్లను పరిశీలించడం, 15వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, జీవాకర్, కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'గంగాపూర్ బ్రిడ్జి నిర్మించకుంటే ఎన్నికల బహిష్కరణ'

ఖానాపూర్: కడెం మండలం ఉమ్మడి గంగాపూర్ పంచాయతీకి వెళ్లే బ్రిడ్జి నిర్మించకుంటే ఎన్నికలు బహిష్కరిస్తామని గంగాపూర్ ఎంపీటీసీ మాలావత్ దాసునాయక్, ఆదివాసీ నాయకుడు ఉర్వట ఆనంద్‌రావు హెచ్చరించారు. పట్టణంలో శనివారం మాట్లాడారు. గంగాపూర్‌తోపాటు రావిగూడ, కొర్రతండా పంచాయతీల పరిధిలోని 12 మంది గ్రామాల ప్రజలంతా బ్రిడ్జి సమస్య పరిష్కారమయ్యే వరకు ఎన్నికలు బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 15 రోజులుగా ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజలు నిరసన తెలుపుతున్నా అధికారులు, పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. విద్య, వైద్యం, రవాణా వసతుల కోసం 1989లో ఎన్నికలు బహిష్కరించినట్లు గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు తమ గ్రామాల సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కలెక్టర్, ఎస్పీ స్పందించి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

సీతక్కను కలిసిన బొజ్జు



బొజ్జుకు మిఠాయి తినిపిస్తున్న సీతక్క

ఖానాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు ములుగు ఎమ్మెల్యే సీతక్కను ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఖానాపూర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

పోయిన ఫోన్లు అప్పగింత



ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 23 ఫోన్లు పోగొట్టుకున్నవారికి ఎస్పీ ప్రవీణ్‌కుమార్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్ పోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. https://www.ceir.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. 23 ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటివరకు 272 ఫోన్లు రికవరీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

రమాదేవి ఇంటికెళ్లిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్

జంగ్ తెలంగాణ

చేరికలు.. వీడ్కోళ్లు!

- అన్ని పార్టీల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి
- బీజేపీకి రమాదేవి రాజీనామా
- బీఆర్‌ఎస్‌ను వీడిన అసమ్మతివర్గం
- 'ఏలేటి' చెంతకు 'ఉద్యమకారులు'
- ఆకర్షిస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు

నిర్మల్: నామినేషన్ల ప్రక్రియకు ముందే క్షేత్రస్థాయి నుంచి బలాన్ని పెంచుకునే పనిలో అన్ని పార్టీలు నిమగ్నమయ్యాయి. ఇందుకు ప్రత్యేక 'ఆపరేషన్స్' చేపడుతున్నాయి. ప్రత్యర్థులను వ్యూహాత్మకంగా దెబ్బకొట్టేందుకు వారి వర్గంలో క్రియాశీలకంగా ఉండి, సరైన ఆదరణ లేని నేతలను ఆకర్షిస్తున్నాయి. టికెట్ ఆశించి దెబ్బతిన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. ఇదే అదనుగా ఆమెను తమ వైపు తిప్పుకునేందుకు వెంటనే ముథోల్ బీఆర్‌ఎస్ నేతలు ఆమె ఇంటికెళ్లారు. ఇక, నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మూడు పార్టీల మధ్య చేరికల పర్వం సీరియస్‌గా సాగుతోంది. బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు ఆధ్వర్యంలో రోజూ పదుల సంఖ్యలో జాయినింగ్స్ కొనసాగుతున్నాయి. క్రమంగా బీఆర్‌ఎస్‌లోనూ పెరుగుతున్నాయి. ఖానాపూర్‌లో చేరికలకంటే ప్రచారంపైనే అభ్యర్థులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారు.

ముథోల్‌లో రాజీనామాలు..

ఇటీవల వరుస పరిణామాలతో ముథోల్ నియోజకవర్గం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడి నుంచి వరుసగా రెండుసార్లు పోటీచేసి, రెండోస్థానంలో నిలిచిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. మూడోసారి టికెట్ తనకే దక్కుతుందన్న ఆశతో ఉన్న ఆమెకు పార్టీ మొండిచేయి ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇక ఇదే నియోజకవర్గంలో రామారావుపటేల్‌కు బీజేపీ టికెట్ ఇవ్వడమే ఆలస్యం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై అసమ్మతితో ఉన్న బీఆర్‌ఎస్ నేతలంతా మూకుమ్మడిగా గులాబీదళాన్ని వీడారు. దసరా రోజే వారంతా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, బాసర, భైంసా జెడ్పీటీసీలు వసంత, దీప, మాజీ ఎంపీపీలు, ఇతర సీనియర్ నేతలు, అనుచరులంతా కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి, రామారావుపటేల్ సమక్షంలో బీజేపీలో చేరారు. తమకు రమాదేవి దూరమైనా.. అదే సమయంలో బీఆర్‌ఎస్ నేతల చేరిక తమకు కలిసొచ్చిందని బీజేపీ శ్రేణులు చెబుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ రెబల్ అభ్యర్థిగా రంగంలోకి దిగాలన్న యోచనలో ఉన్నారు.

నిర్మల్‌లో చేరికల జోరు..

నిర్మల్ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక్కడ ప్రజల్లోకి వెళ్లడం ఎంత ముఖ్యమో.. ప్రత్యర్థులను దెబ్బతీయడమూ అంతే ప్రధానమన్నట్లుగా సాగుతున్నారు. ఇదే లక్ష్యంతో ఎదుటి పార్టీల్లో ప్రధాన అనుచరులను, క్రియాశీలక నేతలను తమ వైపు తిప్పుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పార్టీల్లో సరైన ప్రాధాన్యత లేని నేతలూ ఆహ్వానం అందగానే కండువాలు మార్చేస్తున్నారు. తాజాగా బీఆర్‌ఎస్ పశ్చిమ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, ఉద్యమకారుడు వడ్డి రాజేందర్‌రెడ్డి, మరో ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు అప్పాల వంశీకృష్ణ, నిర్మల్ మాజీ ఎంపీపీ దొలన్‌బీ, మౌలానా దంపతులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. మిగితా రెండు పార్టీలతో పోలిస్తే బీజేపీ ప్రస్తుతం చేరికలపైనే దృష్టిపెట్టినట్లు కనిపిస్తోంది. ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు సైతం ప్రతిరోజూ చేరికలు ఉండేలా చూసుకుంటున్నారు. ఇక అధికార బీఆర్‌ఎస్ మాత్రం చేరికలను కొనసాగిస్తున్నా.. ప్రచారంపైనే సీరియస్‌గా దృష్టిపెట్టినట్లు కనిపిస్తోంది.

ఖానాపూర్‌లో ప్రచారహోరు..

ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన ఖానాపూర్‌లో ప్రస్తుతం ప్రచారపర్వమే కొనసాగుతోంది. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ ప్రచారంతోపాటు బీజేపీ, కాంగ్రెస్‌లోని కీలకనేతలను టార్గెట్ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి రమేశ్‌రాథోడ్ మాత్రం ప్రచారానికే పరిమితమయ్యారు. చేరికలపై ఎక్కువగా దృష్టిపెట్టినట్లు కనిపించడం లేదు. కాంగ్రెస్ అభ్యర్థిగా శుక్రవారం సాయంత్రమే ఖరారైనప్పటికీ, కొన్నినెలల నుంచే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్ తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడా టికెట్ ఆశించి భంగపడ్డ కాంగ్రెస్ నేతలు భరత్‌చౌహాన్ తదితరులు భవిష్యత్తుపై చర్చిస్తున్నారు. పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు, బీజేపీ నేత జానకీబాయి సైతం త్వరలోనే తన కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

ఆర్టీసీకి 'పండుగ'

- 26న అత్యధికంగా ఆదాయం

భైంసాటౌన్: ఆర్టీసీకి దసరా పండుగ సెలవులు కలిసొచ్చాయి. పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. రద్దీ నేపథ్యంలో అదనపు సర్వీసులు నడపడంతోపాటు ప్రయాణికుల సంఖ్య పెంచుకునేందుకు సంస్థ పలు ఆఫర్లను ప్రకటించింది. ఈనెల 21 నుంచి 23, అలాగే 28 నుంచి 30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి నగదు బహువతి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరగడమే కాకుండా ఆర్టీసీకి సైతం భారీగా ఆదాయం సమకూరింది. జిల్లాలోని నిర్మల్, భైంసా డిపోల పరిధిలో దాదాపు లక్ష్యానికి చేరువలో ఆదాయం వచ్చింది.

26న అత్యధికంగా...

ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు భైంసా, నిర్మల్ డిపోల వారీగా రోజువారీ ఆదాయం పరిశీలిస్తే దాదాపు 70 శాతానికి మించి ఆదాయం చేకూరింది. 26న అత్యధికంగా వంద శాతానికి మించి ఆదాయం వచ్చింది. నిర్మల్ డిపోకు రోజువారీ ఆదాయం సరాసరి రూ.28,92,100 కాగా, 26న ఒక్కరోజులోనే రూ.30,80,051 ఆదాయంతో 106.5శాతం నమోదైంది. భైంసా డిపోకు రోజువారీ సరాసరి ఆదాయం రూ.13,26,135 కాగా రూ.14,99,443 ఆదాయంతో 113 శాతం లక్ష్యాన్ని చేరింది.

ఆదాయం పెరిగింది...

దసరా పండుగ నేపథ్యంలో అదనపు సర్వీసులు నడిపాం. ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఆదాయం పెరిగింది. – ఎం.అమృత, డీఎం, భైంసా

వారంరోజుల్లో డిపోలవారీగా ఆదాయం..

తేదీ	నిర్మల్	భైంసా
21	రూ.29,07,806	రూ.10,58,026
22	రూ.22,54,218	రూ.9,68,792
23	రూ.14,88,786	రూ.7,86,698
24	రూ.22,51,710	రూ.5,57,133
25	రూ.26,65,024	రూ.9,88,385
26	రూ.30,80,051	రూ.14,99,443
27	రూ.29,80,020	రూ.11,55,022

బీఆర్‌ఎస్‌లో జోష్



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థులు రామన్న, అనిల్‌జాదవ్

- ఉట్నూర్, ఆదిలాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభలు సక్సెస్
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- ఉమ్మడి జిల్లాలో పది సీట్లు గెలుస్తామని మంత్రి హరీశ్‌రావు ధీమా



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న జాన్సన్‌నాయక్

సాక్షి,ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్/ఉట్నూర్‌రూరల్: మంత్రి హరీశ్‌రావు ఆదిలాబాద్ జిల్లా పర్యటన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూర్‌లో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల సక్సెస్‌తో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో హుషారు కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు గెలుస్తామని హరీశ్‌రావు ఈ సభల్లో ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల ప్రజలు ఈ సభల్లో పాల్గొనగా బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని, కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రి చేయాలన్నారు. అదే సందర్భంలో కేసీఆర్ భరోసా మేనిఫెస్టోను గడపగడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రెండు సభల్లో..

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్, ఆదిలాబాద్‌లలో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. ఉదయం 11.15 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి హెలీక్యాప్టర్‌లో రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఉట్నూర్ చేరుకున్నారు. శాసనమండలి తొలి చైర్మన్ కే.స్వామిగౌడ్ ఆయనతో ఉన్నారు. స్థానిక కేబీ ప్రాంగణం హెలీప్యాడ్‌లో ల్యాండ్ అయింది. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గోడం నగేశ్, సీనియర్ నాయకులు రవీందర్‌రావు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎంపీడీవో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలికి హరీశ్‌రావు చేరుకున్నారు. వేదిక వద్ద ఆయన ప్రసంగిస్తున్నప్పుడు ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ ఆయన పక్కనే నిల్చుండి ప్రజలకు అభివాదం చేస్తూ కనిపించారు. ఉట్నూర్‌లో గంటలో సభ పూర్తి చేసుకుని ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్ ఆయనకు స్వాగతం పలికారు. స్థానిక డైట్ మైదానంలో సభలో పాల్గొన్న హరీశ్‌రావు సుదీర్ఘంగా ప్రసంగించారు. 3.15 గంటలకు సభ ముగిసింది.

స్థానిక సమస్యలపై ప్రస్తావన

హరీశ్‌రావు తన ప్రసంగంలో స్థానిక సమస్యలపై ప్రస్తావించారు. ఉట్నూర్‌లో పోడు పట్టాల అంశాన్ని ప్రధానంగా వివరించారు. మిగిలిపోయిన భూములకు కూడా మళ్లీ సర్వే చేసి పట్టాలు అందిస్తామని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో లోయర్ పెన్‌గంగ డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, కోర్టా–చనాఖా బ్యారేజ్‌ను పూర్తి చేయడం ద్వారా ఈ కలను కేసీఆర్ సాకారం చేశారని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదిలాబాద్‌లో పర్యటించినప్పుడు సీసీఐ గురించి ప్రస్తావించకపోవడంపై హరీశ్‌రావు ఆక్షేపణ వ్యక్తం చేశారు. దాని స్క్రాప్‌ను కూడా అమ్మకానికి పెట్టారని విమర్శించారు. అలాంటి బీజేపీకి ఓట్లు వేయొద్దని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ డకౌట్... కాంగ్రెస్ రనౌట్.. కేసీఆర్ సెంచరీ అంటూ వరల్డ్ కప్ క్రికెట్ పోటీలను అనుకరిస్తూ వివరించడం ద్వారా జనాలను ఆకట్టుకోవాలని చూశారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తకు టికెట్టు ఇచ్చారు..

కాంగ్రెస్ సెకండ్ లిస్టులో ప్రకటించిన ఆదిలాబాద్ అభ్యర్థిపై హరీశ్‌రావు విమర్శలు ఎక్కుపెట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తకు టికెట్టు ఇచ్చారని పేర్కొన్నారు. తాను చచ్చినప్పుడు కూడా ఆర్‌ఎస్‌ఎస్ జెండా కప్పుకుంటానని చెప్పిన వ్యక్తికి ఆదిలాబాద్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ఈ ఎన్నికల్లో ఆ అభ్యర్థికి డిపాజిట్ జప్తేనని పేర్కొన్నారు. కాగా ఉట్నూర్‌లో ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్, ఆదిలాబాద్‌లో జోగురామన్నతో పాటు బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్‌లను పొగడ్తలతో ముంచెత్తారు. ఈ ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సభల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, ఎంపీపీలు తుల శ్రీనివాస్, మార్శెట్టి గోవర్ధన్, తాంసి జెడ్పీటీసీ రాజు, నాయకులు యాసం నర్సింగ్‌రావు, రోకండ్ల రమేశ్, నల్ల రాజేశ్వర్ పాల్గొన్నారు.

జై బోలో.. కుమురంభీం..!



భీమ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- జోడేఘాట్‌లో ఘనంగా వర్ధంతి
- పోరాట యోధుడికి ఘననివాళి
- 'కోడ్' కారణంగా తగ్గిన రద్దీ



నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్

ఆసిఫాబాద్/కెరమెరి: జల్, జంగల్, జమీన్ కోసం నైజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన గిరిజన ముద్దుబిడ్డ కుమురంభీంకు ఘన నివాళులర్పించారు. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో శనివారం కుమురంభీం 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్, అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వరరావు, డీఎంహెచ్‌వో తుకారాం, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పీ రమాదేవి, ఏపీవో భాస్కర్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, భీం మనుమడు సోనేరావు, లాల్ శావ్, పర్‌దాన్ పురోహిత్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సుధాకర్, తదితరులు హాజరయ్యారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాధిపై పూలు చల్లి మొక్కుకున్నారు. అంతకుముందు నాలుగు గోత్రాల జెండాలకు ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం ఆదివాసీలు డోలు, సన్నాయి వాయించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే భీం వారసులకు దుస్తులు పంపిణీ చేశారు.

భీం ఆశయ సాధనకు కృషి

కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి తెలిపారు. జోడేఘాట్‌లో భీం సమాధి వద్ద ఎమ్మెల్యే ఆత్రం సక్కు, భీం మనుమడు సోనేరావుతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కోవ లక్ష్మి, ఆత్రం సక్కు విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ జోడేఘాట్ అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించి మ్యూజియం, ఆర్చ్ నిర్మించినట్లు గుర్తు చేశారు. ఆదివాసీల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఎన్నికల కోడ్ కారణంగా వర్ధంతి కార్యక్రమానికి జనం తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు మినహా ఉమ్మడి జిల్లా పరిధిలోని మిగతా మూడు జిల్లాల నుంచి ఏ ఒక్క అధికారి, నాయకుడు హాజరు కాకపోవడం గమనార్హం.

మిగిలింది మూడు రోజులే..

- ఓటు నమోదుకు ఇదే చివరి అవకాశం



ఓటరు నమోదు పోర్టల్ ఇమేజ్

నిర్మల్ ఖిల్లా: ఓటరుగా నమోదుకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉంది. అర్హులైన యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అర్హులైన వారందరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ అనేక చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈనెల 31 వరకు అవకాశం కల్పించింది. ఓటరుగా నమోదైన వారు ఈఎన్నికల్లోనే ఓటువేసే అవకాశం కల్పిస్తారు.

పోలింగ్ శాతం పెంపే లక్ష్యంగా...

నవంబర్ 30న జరగనున్న శాసనసభ ఎన్నికల్లో అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలింగ్ శాతం పెంచే దిశగా యువతీయువకుల్ని చైతన్యపరుస్తున్నారు. ఇందులో భాగంగానే ఈసారి నూతన ఓటు నమోదుకు ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించింది.

ప్రస్తుతం జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గాల వారీగా..

నిర్మల్	2,47,495
ముథోల్	2,46,030
ఖానాపూర్	2,17,665

రూ.3.65 లక్షలు పట్టివేత



నగదు పట్టుకున్న పోలీసులు

భైంసా: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.65 లక్షల నగదును పట్టుకున్నట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. బాసర చెక్‌పోస్ట్ వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో ముగ్గురు వ్యక్తులు నగదుతో పట్టుబడ్డారు. నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగదును సంబంధిత అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

ఎన్నికల ఖర్చు వివరాలు నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అకౌంటింగ్ టీం, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ టీమ్ ఉద్యోగులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి పోటీచేసే అభ్యర్థుల ఆమోదం, ఆమోదయోగ్యం కాని ఖర్చుల వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీం, వీఎస్టీ, వీవీటీలు నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలో అన్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి, వీడియో పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులకు అందజేయాలని వివరించారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం పూర్తి వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులకు అందజేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాల ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చుల అకౌంట్లు, రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ అధికారులకు బృందాల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి విజయ పాల్గొన్నారు.

గిరిపుత్రుల అడ్డా బోథ్


సీ.మాధవ్‌రెడ్డి


ఎస్‌ఏ.దేవుషా


అమర్‌సింగ్ తిలావత్


కాశీరాం




సోయం బాపురావు


రాథోడ్ బాపురావు


గోడం నగేష్


గోడం రామారావు

- మొదట్లో జనరల్.. తదుపరి ఎస్టీ రిజర్వ్‌డ్
- ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు

ఇచ్చోడ(బోథ్): పోరాటాల గడ్డ బోథ్ నియోజకవర్గం గిరిపుత్రుల అడ్డాగా మారింది. కొండలు, గుట్టల నడుమ అమాయక గిరిజన గ్రామాలు, వాగులు, వంకలు దట్టమైన అటవీ ప్రాంతాల్లో సగానికి పైభాగం ఉన్న ఈ నియోజకవర్గం దశాబ్దాల కాలం నుంచి పోరాటాలకు కేంద్ర బిందువుగా ఉంది. నిజాం కాలంలో పునికి పుచ్చుకున్న చైతన్యం.. మావోయిస్టుల కాలం వరకు ప్రశ్నించేతత్వం, మాడే కడుపులతో సైతం పోరాటబాట వదలని పోరుగడ్డగా చరిత్ర కెక్కింది. 1962లో ఏర్పడ్డ ఈ నియోజకవర్గం మొదటిసారి జరిగిన ఎన్నికల్లో జనరల్ స్థానం కాగా 1967లో జరిగిన పునర్విభజనలో ఎస్టీ రిజర్వ్ అయింది. జనరల్‌లో జరిగిన ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీ.మాధవ్‌రెడ్డి ఎన్నిక కాగా తొమ్మిది పర్యాయాలు గోండులు గెలుపొందారు. 1978లో మొదటిసారి లంబాడా వర్గానికి చెందిన అమర్‌సింగ్ తిలావత్, 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో రాథోడ్ బాపురావు విజయం సాధించారు.

మొదట్లో జనరల్ ...

- 1962లో మొదటిసారిగా బోథ్ నియోజకవర్గం జనరల్‌స్థానం. తొలిసారి జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాంగ్రెస్ నుంచి సీ.మాధవ్‌రెడ్డి గెలుపొందారు. 1967లో ఈ నియోజకవర్గం ఎస్టీకి రిజర్వ్‌డ్ అయింది.
- ఉట్నూర్ కేంద్రంగా పాలన సాగించిన గోండు రాజుల వంశస్థుడు దేవుషా 1967 నుంచి 1977 వరకు రెండు పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందాడు. 1978లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అమర్‌సింగ్ తిలావత్, 1983లో కాంగ్రెస్ అభ్యర్థి కాశీరాం విజయం సాధించారు
- అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో టీడీపీ పాగా వేసింది. 1985లో తెలుగుదేశం ఆవిర్భావంతో కాంగ్రెస్ అభ్యర్థి సిడాం భీంరావుపై టీడీపీ అభ్యర్థి గోడం రామారావు విజయం సాధించారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి గెలిచిన గోడం రామారావు ఎన్టీఆర్ మంత్రివర్గంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో గోడం రామారావు రెండోసారి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై 1994 వరకు కొనసాగారు.
- 1994లో జరిగిన ఎన్నికల్లో రామారావు తనయుడు గోడం నగేష్‌కు టీడీపీ టికెట్ ఇవ్వడంతో విజయం సాధించి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 1999లో జరిగిన ఎన్నికల్లో నగేష్ రెండోసారి గెలిచారు.
- 2004లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీ తరపున బరిలోకి దిగిన సోయం బాపురావు చేతిలో నగేష్ ఓటమి పాలయ్యారు. అప్పటి వరకు టీడీపీకి కంచుకోటగా ఉన్న బోథ్ నియోజకవర్గం టీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లింది. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సోయం బాపురావు కాంగ్రెస్‌లో చేరారు.
- 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన గోడం నగేష్ విజయం సాధించారు. 2014 ఎన్నికల కంటే కొద్దిరోజుల ముందు నగేష్ టీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బోథ్ రాజకీయాల్లో మార్పులు జరిగాయి. గోడం నగేష్‌కు టీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ టికెట్ ఇవ్వగా స్థానికేతరుడైన రాథోడ్ బాపురావుకు బోథ్ అసెంబ్లీ టికెట్ కట్టబెట్టారు.
- 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అనిల్‌జాదవ్, టీడీపీ నుంచి సోయం బాపురావు, టీఆర్ఎస్ నుంచి రాథోడ్ బాపురావు పోటీలో నిలవగా రాథోడ్ బాపురావు విజయం సాధించారు. 2018 ముందస్తు ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి రాథోడ్ బాపురావు, కాంగ్రెస్ నుంచి సోయం బాపురావు, స్వంతంత్ర అభ్యర్థులుగా అనిల్‌జాదవ్ పోటీలో నిలవగా టీఆర్ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపురావు విజయం సాధించారు.

నియోజకవర్గంలో ఓటరు వివరాలు

మొత్తం ఓటర్లు	2,06,700
పురుషులు	1,00,656
మహిళలు	1,06,031
ఇతరులు	13

మంత్రి పదవులు

నియోజకవర్గంలో మొదటిసారిగా 1975లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన అమర్‌సింగ్ తిలావత్ 6 నెలల పాటు టూరిజం శాఖ మంత్రిగా, 1985లో గెలుపొందిన గోడం రామారావు టీడీపీ హయాంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా, 1994లో టీడీపీ నుంచి గెలుపొందిన గోడం నగేష్ గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు.

పునర్విభజనతో మార్పులు...

నియోజకవర్గం ఏర్పాటు నుంచి బోథ్‌లో బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాలు ఉండేవి. 2009 పునర్విభజనలో ఇంద్రవెల్లి మండలం ఖానాపూర్‌లో, నార్నూర్ మండలాన్ని ఆసిఫాబాద్‌లో కలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఉన్న తాంసి, తలమడుగు మండలాలను బోథ్ అసెంబ్లీ నియోజకవర్గంలో కలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఏడు మండలాలతో ఉన్న నియోజకవర్గం ప్రస్తుతం నూతనంగా భీంపూర్, సోనాల, సిరికొండ మండలాల ఏర్పాటుతో పది మండలాలతో కొనసాగుతోంది.

తాయిలమిస్తే తప్పదు శిక్ష ..

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- భారతీయ శిక్షాస్మృతి, ప్రాతినిధ్య చట్టం కింద జైలు, జరిమానా

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 30న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు చేయని ప్రయత్నమంటూ ఉండదు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అనేక రకాల తాయిలాలు అందిస్తుంటారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా ఎన్నికల చట్టం ప్రకారం నేరమే. ప్రభావితం చేసిన వారిపై భారతీయ శిక్షాస్మృతి ప్రజా ప్రాతినిధ్య చట్టం రింజేటేషన్ ఆఫ్ పీపుల్ -యాక్ట్)-1951, ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం పలు రకాల కేసులు నమోదు చేస్తారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చర్యలు తప్పవు. జరిమానాతో పాటు జైలుశిక్ష పడే అవకాశం కూడా ఉంది. ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే, ధన ప్రభావం తగ్గాలంటే, ఉత్తమ అభ్యర్థులు గెలవాలంటే అక్రమాలపై పౌరులు కూడా ఆధారాలతో ఫిర్యాదు చేయాలి. ఈ నేపథ్యంలో ఏయే నేరాలకు ఎలాంటి శిక్షలు, జరిమానాలు విధిస్తారో తెలుసుకుందాం.

మద్యం పంపిణీ చేస్తే..


ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మద్యం పంపిణీ చేస్తుంటారు. అనుమతి లేకుండా పరిమితికి మించి మద్యం నిల్వ ఉంచుకున్నా, విక్రయించినా, ఓటర్లకు పంపిణీ చేసినా కేసు నమోదు చేస్తారు. ఓటర్లకు సారా, కల్లు, మద్యం, ఇతర మత్తు పదార్థాలు ఇస్తే నేరమే అవుతుంది. పట్టుబడిన సారా, మద్యాన్ని బట్టి ఎక్సైజ్ చట్టం-1968 సెక్షన్ 34 (ఎ) ప్రకారం ఆరు నెలల నుంచి ఏడాది వరకు జైలుశిక్ష, రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు జరిమానా విధిస్తారు.

ఓటర్లకు డబ్బులు పంచితే..

ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు ఓట్లను నోట్లతో కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేటప్పుడు పట్టుబడితే ఐపీసీ-171 (ఇ) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ప్రజా ప్రతినిధ్య చట్టం ప్రకారం కూడా శిక్షలు అమలు చేస్తారు.

విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే...

ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వర్గాల మధ్య శతత్వాన్ని పెంచేలా విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తే వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్పీయాక్ట్) 125 నిబంధన ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. రెండూ కూడా విధించవచ్చు. ఎవరూ మతాలు, వర్గాలను కించపరిచేలా, మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడొద్దు.



ఎన్నికల నియమావళి ప్రకారం వీటిపై చర్యలు

బెదిరింపులకు పాల్పడితే...

ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని అభ్యర్థులు, పార్టీల నాయకులు ఓటర్లను బెదిరించకూడదు. ఓటర్లను బెదిరిస్తే ఐపీసీ సెక్షన్ 171 (సీ) ప్రకారం కేసు నమోదు చేస్తారు. ఏడాది జైలుశిక్షతో పాటు, జరిమానా కూడా విధించవచ్చు. రెండూ విధించే అవకాశం కూడా ఉంది.

కానుకలు ఇస్తే..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఆకర్షించడానికి కానుకలు అందించినా నేరమే. మహిళలకు చీరలు, గృహోపకరణాలు ఇవ్వడం, యువకులకు క్రీడా కిట్లు, చరవాణులు ఇలా ఏమిచ్చినా ఐపీసీ సెక్షన్ 171 (ఈ) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

అబద్ధాలతో ప్రచారం చేస్తే..

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు అబద్ధాలు చెబుతూ ప్రచారం చేస్తే అదికూడా నేరమే అవుతుంది. లేని వాటిని ఉన్నట్లు చెప్పడం, పోటీ చేసే రాజకీయ ప్రత్యర్థిపై తీవ్రమైన నిందలు వేస్తూ అబద్ధాలు చెప్పడం నేరంగా పరిగణిస్తారు. అందుకు ఐపీసీ సెక్షన్ 171 (జీ) ప్రకారం జరిమానా విధిస్తారు.

దొంగ ఓట్లు వేస్తే...

ఎన్నికల్లో ఒకరి ఓటు మరొకరు వేస్తుంటారు. ఇలాంటి వాటినే దొంగఓట్లు అంటారు. తర్వాత వచ్చిన అసలు ఓటరు తన ఓటు ఎవరో వేశారని తెలిసి అవాక్కవుతాడు. ఇలా దొంగ ఓట్లు వేయించినా, వేసినా చట్ట ప్రకారం నేరమే అవుతుంది. దీనికి ఐపీసీ సెక్షన్ 171 (ఎఫ్) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

క్లుప్తంగా

పోలీసు, ఎక్సైజ్ అధికారుల దాడులు


గుడుంబాతో ఎక్సైజ్, పోలీసు అధికారులు

సారంగపూర్: మండలంలోని గిరిజన గ్రామాల్లో శనివారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. దేవీతండాకు చెందిన పవార్ సురేఖ వద్ద 25 లీటర్లు, రాథోడ్ మంగీలాల్ ఇంట్లో 25 లీటర్లు, సునాలీబాయి ఇంట్లో 10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకం లభ్యమయ్యాయి. కౌట్ల (బి) శాంతినగర్‌కాలనీకి చెందిన చౌహాన్ సల్లుబాయి అలియాస్ శైలజ ఇంట్లో 5 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లంపానకం, లింగాపూర్ తండాకు చెందిన ఆడె వినోద్ ఇంట్లో 7 క్వార్టర్ల మద్యం సీసాలు పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ సంపత్ క్రిష్ణ తెలిపారు. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేయాలి

- రాష్ట్ర మహిళా కమిషన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుమ్ర ఈశ్వరీబాయి, కుస్రం నీలాబాయి

గుడిహత్నూర్: జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేసి నేలరాలిన ఆదివాసీ యోధుడు కుమురంభీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాబాయి అన్నారు. కొమురంభీం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని భీం విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన వేడుకలకు హాజరై మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడు కొమురంభీం అని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అంతకుముందు మాన్కాపూర్ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు సంప్రదాయ వాయిద్యాలతో వచ్చి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, నేతకాని సంఘం రాష్ట్ర నాయకురాలు సర్పె సోంబాయి, ఆదివాసీ మహిళా నాయకురాలు తొడసం ధనలక్ష్మి, ఆదివాసీ సంఘాల నాయకులు కుడ్మెత జంగు, ఆదివాసీ సేనా నాయకులు రాయిసిడం జంగు, ఉయిక లక్ష్మణ్, కోవ భగవాన్, సతీష్, మారుతి ఉన్నారు.


కొమురంభీం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మహిళా నాయకులు

రూ.5 లక్షలు సీజ్

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద కారులో తరలిస్తున్న రూ.5లక్షల నగదును సీజ్ చేసినట్లు వన్ టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన మంజిల్ జబుల్‌కర్ తన కారులో నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న పోలీసులు అతడి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నగదు లభించింది. నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసుకొని నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.


పట్టుకున్న నగదుతో పోలీసులు

రూ. 2.5 లక్షలు పట్టివేత

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద కారులో తరలిస్తున్న రూ. 2.5 లక్షల నగదును పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఢిల్లీకి చెందిన రషీద్ అహ్మద్ శనివారం తన కారులో ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు వాహనాన్ని తనిఖీ చేయడంతో నగదు లభించింది. సరైన పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి నగదు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

కడెం: మండలంలోని పాండ్వపూర్‌లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. ఇంద్రవెల్లి మండలం అంజి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపల్లి నుంచి అంజి గ్రామానికి బయలుదేరారు. కడెం మండలంలోని పాండ్వపూర్ హనుమాన్ టెంపుల్ సమీపంలోని మూలమలుపు వద్దకు వెళ్లగానే బైక్‌ను కారు ఢీకొట్టింది. ఘటనలో బైక్‌పై ఉన్న సాయబ్‌రావు, నాగరాజు, ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య

బోథ్: పురుగుల మందుతాగి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సొనాల గ్రామానికి చెందిన పటేన్ల రుక్మాబాయి(73) కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. దీనికితోడు అస్తమా కూడా ఉంది. దీంతో జీవితంపై విరక్తితో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బడిబాట వదిలి ఎన్నికల ప్రచారంలో







ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ పార్టీల నాయకులకు కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. అయితే ప్రచారంలో పాల్గొనే వారికి పార్టీ కండువాలు, టోపీలు, బాణసంచా కాల్చడానికి, వాటర్ బాటిల్స్ అందించడానికి బాల కార్మికులను వినియోగించుకుంటూ వారికి రోజుకు రూ.200 నుంచి 400 వరకు ఇస్తున్నారు. బడిలో ఉండాల్సిన పిల్లలు ఎన్నికల ప్రచారంలో దినసరి కూలీలుగా మారుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పరిశీలకులుగా ఇమ్రాన్

కడెం: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పరిశీలకులుగా మండలంలోని అంబారిపేట్ జిల్లా పరిషత్ పాఠశాల పీఈటీ షేక్ ఇమ్రాన్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వి.రమేశ్ పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట్‌లో ఈ నెల 30 నుంచి నవంబర్ 1వరకు యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు పరిశీలకులుగా ఎంపికైపై పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్రగాయాలు

జైనథ్: మండలంలోని పూసాయి గ్రామ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ఆదిలాబాద్ వైపు నుంచి పూసాయి వైపు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న భీంరావ్, దేవిదాస్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో రిమ్స్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నేరడిగొండ(బోథ్): మండలంలోని కుంటాల జలపాతానికి వెళ్లే దారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కుంటాల రోడ్డు వద్ద శనివారం గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సంఘటనా స్థలానికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు ఆడె గజేందర్ 108కు ఫోన్ చేశారు. స్థానిక ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 61వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని బామిని(బి)కి చెందిన కందారపు శ్రీకాంత్, కోస్లీ దిగంబర్ తమ సొంత పని నిమిత్తం నిర్మల్ పట్టణానికి బైక్‌పై వెళ్తుండగా నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రులను నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తాంసి నుంచి ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులు

తాంసి(బోథ్): పోరాటాలకు పురిటిగడ్డగా పేరొందిన తాంసి మండలం నుంచి ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో తాంసి మండల కేంద్రానికి చెందిన వన్నెల అశోక్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా, హస్నాపూర్ గ్రామానికి చెందిన కంది శ్రీనివాస్‌రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారు చేసింది. తాంసి మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఎన్నికల బరిలో నిలవడంతో మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


వన్నెల అశోక్


కంది శ్రీనివాస్‌రెడ్డి

బాసర ఆలయంలో చండీహోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు


చెక్కు అందిస్తున్న దాతలు

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయ ఆవరణలో శనివారం చండీహోమం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా చతుర్వేద సరస్వతీ మంత్ర సహిత చండీహోమం చేశారు. ఉదయం 9గంటల నుంచి గణపతి పూజ, కలశస్థాపన, రక్షా బంధనం, మండపారాధన, పుణ్యాహవచనం నిర్వహించారు.

బాసర ఆలయానికి విరాళం..

హైదరాబాద్‌కు చెందిన గనిమినేని రాకేశ్ కుటుంబీకులు బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి రూ.2,56,000 విరాళం అందజేశారు. ఈ మేరకు శనివారం ఆలయ అధికారులకు చెక్కు అందజేశారు. ఆలయ అభివృద్ధి నిమిత్తం విరాళం అందజేసినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

తమ్ముడు నేవీలో.. అన్న పోలీసు ఉద్యోగంలో

- ఒకే కుటుంబంలో అన్నాతమ్ముళ్లు

సారంగపూర్: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నాతమ్ముళ్లు నెలరోజుల వ్యవధిలోనే రెండు ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన మాన్వారి లక్ష్మణ్-లక్ష్మీలకు ముగ్గురు సంతానం. ఇందులో పెద్ద కుమార్తెకు వివాహం కాగా ఇద్దరు కుమారులు లక్ష్మీరాజు, వినేష్ ఉన్నారు. అయితే బీడీ కంపెనీ నిర్వహిస్తూ ఇద్దరు కుమారులను తల్లిదండ్రులూ కష్టపడి చదివించారు. వారి కోరుకున్నట్లే పెద్దవాడైన లక్ష్మీరాజు ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నెలరోజుల వ్యవధిలోనే రెండురోజుల క్రితం విడుదలైన నావికాదళం(నేవి) ఉద్యోగానికి అతడి తమ్ముడు వినేష్ ఎంపికయ్యాడు. శుక్రవారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నాడు. తమ్ముడు దేశ రక్షణ దళంలో, అన్న రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడే ఉద్యోగం సాధించడంపై మండల ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తూ శభాష్ సోదరులారా అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.


లక్ష్మీరాజు


వినేష్

15 మంది బైండోవర్

లక్ష్మణచాంద: ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం 15మందిని బైండోవర్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపాడు. గతంలో నేర చరిత్ర కలిగిన, నేర స్వభావం కలిగిన 15మంది శనివారం తహసీల్దార్ శ్రీలత ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. దీంతో ఇప్పటి వరకు మండలంలో మొత్తం 30 మందిని బైండోవర్ చేశామన్నారు. ఆయన వెంట ఏఎస్సై నారాయణ రెడ్డి ఉన్నారు.